నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13-5-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 224 పేజీలు:4 వెల: రూ.1/-

57 రాజ్యసభ స్థానాలకు జూన్ 10న ఎన్నికలు..

న్యూఢిల్లీ, మే 12:57 రాజ్యసభ స్థానాలకు జూన్ 10వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజున సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నారు. ఈనెల 24వ తేదీన రాజ్యసభ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్‌కు చివరి గడువు మే 31వ తేదీ. మొత్తం 15 రాష్ట్రాల్లో ఉన్న 57 ఖాళీలకు ఈ ఎన్నికలు జరుగుతాయి. యూపీలో 11, ఏపీలో 4, రాజస్థాన్ లో 4, చత్తీస్‌ఘడ్ లో 4, జార్ఖండ్ లో 2, మహారాష్ట్రలో 6, తమిళనాడులో 6, పంజాబ్ లో 2, ఉత్తరాఖండ్ లో 2, బీహార్ లో 5, తెలంగాణలో 2, హర్యానాలో రెండు, మధ్యప్రదేశ్‌లో మూడు, ఒడిశాలో3 స్థానాలు ఉన్నాయి. తెలంగాణ నుంచి లక్ష్మీకాంత రావు, ధర్మపురి శ్రీనివాస్.. జూన్‌లో రిటైర్ కానున్నారు. ఆ ఇద్దరి స్థానాలకు జూన్ 10న ఎన్నికలు ఉంటాయి.

భరూచ్‌లో జరిగిన 'ఉత్కర్ష్ సమారోహ్' ను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 12:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న గుజరాత్ లోని భరూచ్ లో జరిగిన 'ఉత్కర్ష్ సమారోహ్' ను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రసంగించారు. అవసరం అయిన వర్గాల వారికి ఆర్థిక సహాయాన్ని సరి అయిన కాలం లో అందించడానికి తోడ్పడే నాలుగు కీలక పథకాల ను భరూచ్ జిల్లా లో రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం మేరకు అమలు పరచినందుకు గుర్తు గా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమైంది. ఈ సందర్భం లో హాజరు అయిన వారిలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర భాయీ పటేల్ తదితరులు ఉన్నారు.

ప్రధాన మంత్రి కి ఆ ప్రాంత మహిళ లు ఒక పెద్ద రాఖీ ని కానుక గా ఇచ్చారు. ఆయన ఆరోగ్యం గా ఉండాలని, దీర్ఘాయుష్షు ను కలిగి ఉండాలని వారు ఆకాంక్షించారు. దేశం లో మహిళల గౌరవాన్ని, వారి జీవనాన్ని సరళతరం గా మార్చేందుకు ఆయన చేసిన అన్ని పనుల కు గాను ఆయన కు వారు తమ ధన్యవాదాల ను తెలియజేశారు. ప్రధాన మంత్రి వివిధ పథకాల లబ్ధిదారుల తో మాట్లాడారు.

దృశ్య జ్ఞ?నానికి నోచుకోనటువంటి ఒక లబ్ధిదారు తో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, అతడి కుమార్తె లు ఏమి చదువుతున్నదీ అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భం లో ఆ వ్యక్తి యొక్క కుమార్తె తన తండ్రి కి ఉన్న సమస్య ను గురించి వివరిస్తూ భావోద్వేగాని కి లోనయ్యారు. ఆ వేళ ప్రధాన మంత్రి విచలితుడై, ఆమె సూక్ష్మ బుద్ధి ఆమెకు ఉన్నటువంటి బలం అని తెలియజెప్పారు. ఆ వ్యక్తి మరియు అతని కుటుంబ సభ్యులు ఈద్ ను ఏ విధం గా జరుపుకొన్నారంటూ ప్రధాన మంత్రి అడిగారు. ఆయన టీకా మందు ను వేయించుకొని, పుత్రిక ల ఆకాంక్షల ను నెరవేర్చాలని పాటుపడుతున్నందుకు ప్రధాన మంత్రి అభినందన లు తెలిపారు. ఒక మహిళా లబ్ధిదారు తో ప్రధాన మంత్రి మాట్లాడుతూ ఆమె జీవనం ఎలా సాగుతోందో తెలుసుకోగోరారు. హుందాగా మనుగడ సాగించాలి అని ఆమె పెట్టుకొన్నటువంటి దృఢ సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు. ఒక యువ వితంతు మహిళ మాట్లాడుతూ తన పిల్లల కు ఒక మంచి జీవనాన్ని ఇస్తున్న తన జీవన యాత్ర ను గురించి ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకువచ్చారు. చిన్న పొదుపు మొత్తాల పథకం లో చేరవలసిందంటూ ఆమె కు ప్రధాన మంత్రి సూచన చేశారు. ఆ మహిళ సంకల్పాన్ని నెరవేర్చుకొనేటట్లు ఆవిడ కు తోడ్పాటు ను ఇవ్వండి అని అధికారుల తో ప్రధాన మంత్రి చెప్పారు.

శ్రోతల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ప్రభుత్వం నిజాయతీ తో, ఒక సంకల్పం తో, లబ్ధిదారు చెంతకు చేరుకొన్నప్పుడు ఒనగూరే ఫలప్రదమైనటువంటి ఫలితాల కు ఒక నిదర్శనం నేటి 'ఉత్కర్ష్ సమారోహ్' అన్నారు. సామాజిక భద్రత కు సంబంధించిన నాలుగు పథకాల ను లక్షిత లబ్ధిదారులు అందరికీ వర్తింపజేసినందుకు గాను గుజరాత్ ప్రభుత్వాన్ని మరియు భరూచ్ జిల్లా పాలన యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. లబ్ధిదారుల లో ఆత్మవిశ్వాసం, సంతృప్తి ఉట్టిపడుతున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ఆదివాసీలు, షెడ్యూల్డు కులాలు, ఇంకా అల్పసంఖ్యాక సముదాయాల కు చెందిన చాలా మంది పౌరుల కు సమాచారం వారి వరకు చేరని కారణం గా పథకాల తాలూకు ప్రయోజనాల కు వారు దూరం గా ఉండిపోతున్నారు అని ఆయన అన్నారు. 'సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్' తాలూకు భావన మరియు చిత్తశుద్ధి తో కూడిన ఉద్దేశ్యాలు ఎల్లప్పుడూ మంచి ఫలితాల ను ఇస్తాయని ఆయన అన్నారు.

త్వరలో ప్రభుత్వం యొక్క 8వ వార్షికోత్సవం రానుందని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ప్రభుత్వం యొక్క 8 ఏళ్ళ కాలం 'సేవ కు, సుపరిపాలన కు, పేదల సంక్షేమాని కి' అంకితం చేయడం జరిగింది అని పేర్కొన్నారు. తన పాలన యంత్రాంగం యొక్క సాఫల్యాల తాలూకు ఖ్యాతి ని ప్రజల లో ఒకరు గా ఉంటూ, నిరాదరణ, పేదరికం మరియు అభివృద్ధి.. ఈ విషయాల ను గురించి నేర్చుకొంటూ తాను గడించినటువంటి అనుభవానిది అని ఆయన వివరించారు.

పేదరికం తాలూకు స్వీయ అనుభవం మరియు సామాన్య ప్రజానీకం యొక్క అవసరాల కు అనుగుణం గా తాను పాటుపడతానని ఆయన చెప్పూ, అర్హత కలిగిన ప్రతి ఒక్క వ్యక్తి కి పథకం యొక్క పూర్తి ప్రయోజనం లభించాలి అని స్పష్టం చేశారు. సాధించిన విజయాల ను చూసుకొని విశ్రాంతి తీసుకోకూడదని గుజరాత్ గడ్డ తనకు నేర్పించింది అని ప్రధాన మంత్రి అన్నారు. పౌరుల సంక్షేమం యొక్క పరిధి ని మెరుగు పరచడం, విస్తరించుకుంటూ పోవడం.. ఇవే ఎల్లవేళలా తన ధ్యేయం అని ఆయన అన్నారు. "100 శాతం మంది కి హితం అనేదే (సేచురేశన్) నా కల. మనం 100 శాతం లబ్ధి దిశ లో ముందుకు సాగవలసివుంది. ప్రభుత్వ యంత్రాంగం దీనిని అలవరచుకోవాలి. మరి పౌరుల లో ఒక విశ్వాసాన్ని అంకురింప చేయాలి" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

2014వ సంవత్సరం లో దేశ జనాభా లో సుమారు సగం మంది టాయిలెట్ ల సదుపాయం, టీకా మందు సౌకర్యం, విద్యుత్తు కనెక్షన్ సదుపాయం మరియు బ్యాంకు ఖాతా సదుపాయాల కు నోచుకోకుండా ఉండిపోయారు అని ప్రధాన మంత్రి అన్నారు.

గడచిన కొన్నేళ్ళ లో మనం, అందరి ప్రయాసల తో అనేక పథకాల ను లక్షిత లబ్ధిదారులు యావన్మందికీ వర్తింప చేసే స్థితి (సేచురేశన్) కి చేరువ గా తీసుకురాగలిగాం. 8 ఏళ్ళ కాలం తరువాత, మనం కొత్త దృఢత్వం మరియు సరికొత్త సంకల్పం తో మనల ను మనం పునరంకితం చేసుకోవలసిన అవసరం ఉంది అంటూ ప్రధాన మంత్రి ఉద్బోధించారు.

లబ్ధిదారులు యావన్మందికీ మేలు చేయడం (100 శాతం కవరేజి) అంటే దాని అర్థం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' స్ఫూర్తి తో ప్రతి ఒక్క వర్గాన్ని, ప్రతి ఒక్క తెగ ను సమానం గా చూడడం అని ప్రధాన మంత్రి వివరించారు.

పేద ప్రజల సంక్షేమం కోసం తలపెట్టిన ప్రతి ఒక్క పథకం పరిధి లో నుంచి ఏ ఒక్కరిని వెనుకపట్టు న వదలి వేయకూడదు. దీని ద్వారా సంతృప్తిపరచేటటువంటి రాజకీయాలు అంతం అవుతాయి. ఇక్కడ శాచ్యురేశన్ అంటే ప్రయోజనం అనేది సమాజం లో చిట్టచివరి వ్యక్తి వరకు చేరడం అని అర్థం అని ప్రధాన మంత్రి అన్నారు.

ఆ ప్రాంతాని కి చెందిన వితంతు సోదరీమణులు తనకు నజరానాగా ఇచ్చినటువంటి ఒక రాఖీ తనకు బలాన్ని ఇచ్చిందంటూ వారికి ప్రధాన మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

వారి ఆకాంక్ష లు తనకు ఒక కవచం వంటివి అని ఆయన చెప్తూ, అవి మరింత ఎక్కువ గా శ్రమించడాని కి తన కు ప్రేరణ గా ఉంటాయన్నారు.అందరి ప్రయాసలు మరియు విశ్వాసం.. వీటి వల్లే ఎర్రకోట బురుజుల మీది నుంచి సేచురేశన్ తాలూకు లక్ష్యాన్ని తాను ప్రకటించగలిగినట్లు ప్రధాన మంత్రి తెలిపారు. ఇది సామాజిక భద్రత పరం గా చూసినప్పుడు ఒక భారీ కార్యక్రమం అని ఆయన అన్నారు. ఈ ఉద్యమం పేద ప్రజల కు గౌరవాన్ని ఇచ్చేటటువంటి కార్యక్రమం ('గరీబ్ కో గరిమ') అని ఆయన అభివర్ణించారు.

అసనితో అలజడి, జోరుగా వానలు.. సురక్షిత ప్రాంతాలకు లోతట్టు గ్రామాల ప్రజలు

అమరావతి, మే 12:అసని తుపాను తీరంలో అలజడి సృష్టిస్తోంది.. వాయుగుండం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. తుపాను కారణంగా కృష్ణపట్నం,బాపట్ల, వాడరేవు, కళింగపట్నం, భీమునిపట్నం, కాకినాడ, నర్సీపట్నం ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తీరంలో సముద్రవేటకు వెళ్లిన మత్స్యకారులను సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత 18 జిల్లాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్వాసితులు ఒక్కొక్కరికీ రూ. 1000, కుటుంబానికి రూ. 2000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందించాలన్నారు. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండి సహాయ, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

ప్రధానంగా బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఇప్పటికే తుపాను సహాయక నిధులు మంజూరు చేశామని అవసరమైన మేర ఖర్చు చేయాలన్నారు. కోస్తా తీరంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణ, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలపై తుపాను ప్రభావం చూపుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాయుగుండం కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా ముఖ్య మంత్రి దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 454 చోట్ల సహాయ, పునరావాస కేంద్రాలను గుర్తించామని అధికారులు వివరించారు. అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. డీజిల్, జనరేటర్లు, జేసీబీల వంటి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్వాసితులకు, పునరావాస కేంద్రాలకు అవసరమైన బియ్యం, పప్పు దినుసులు, వంట నూనెల వంటి నిత్యావసరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సహాయక చర్యలకు అవసరమైన సిబ్బందిని నియమించాలని శాఖల మధ్య సమన్వయంతో పరిస్థితిని అధిగమించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఏ ఒక్క మరణం సంభవించకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గంటకు 30 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ప్రాంతాల్లో లైన్ల పునరుద్ధరణకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించి ముందు జాగ్రత్తగా సహాయ,పునరావాస చర్యలపై దృష్టి సారించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో సదుపాయాలను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఖాళీ చేయించి సహాయ కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిర్వాసితులకు భోజన, వసతి సౌకర్యాల కల్పనలో ఖర్చుకు వెనుకాడరాదన్నారు. బాధితుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి తగిన సాయం అందించాలని ఉద్ఘాటించారు. బాధితులు పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఆర్థిక సాయం అందించాలన్నారు. వరద ముంపు నుంచి తేరుకున్న తరువాత ఇళ్లను బాగుచేయించుకునేందుకు ఈ ఆర్థిక సాయం ఉపకరిస్తుందని చెప్పారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న 7 జిల్లాల్లో ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా, ఉభయగోదావరి, ఏలూరు, కాకినాడ ప్రాంతాలు, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, మన్యం జిల్లాలపై తుపాను కేంద్రీకృతమైనందున ఆ జిల్లాల అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉండాలని నిర్దేశించారు.

బాధితులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఉప్పాడ రోడ్డుకు శాశ్వత పరిష్కారమార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇందుకు సంబంధించి చెన్నై ఐఐటీ నిపుణులతో సంప్రతించి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, హోం, ప్రకృతి విపత్తుల నిర్వహణ మంత్రి తానేటి వనిత, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పూనం మాలకొండయ్య, జీ సాయి ప్రసాద్, అజయ్ జైన్, రవాణా, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, విపత్తుల నిర్వహణ విభాగం డైరెక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ దవాఖానల అభివృద్ధికి ప్రాధాన్యం : మంత్రి తలసాని

హైదరాబాద్, మే 12: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ దవాఖానాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డలోని ఛాతీ దవాఖానాలో రోగి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన రూ.5 భోజన కేంద్రాన్ని గురువారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిమ్స్ తరహాలోనే నగరం నలుమూలల టిమ్స్ సూపర్‌స్పెషాలిటీ దవాఖానాల నిర్మాణం జరగనుందన్నారు.

నగరంలోని 18 ప్రభుత్వ దవాఖానలకు రోజు వేలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారని, వారు తమ భోజన అవసరాల కోసం రోజు రూ.150 నుంచి రూ.200ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఈ విషయం పై దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ రోగుల సహాయకులకు రూ.5 కే నాణ్యమైన భోజనం అందించే ఆలోచన చేశారన్నారు. హరేరామ, రహేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏదైనా రూ.5 కే అందజేసే ఏర్పాట్లు చేశామన్నారు.

ఈ భోజనం ఇంట్లో మాదిరిగానే రుచికరంగా, నాణ్యతగా ఉంటుందన్నారు. దవాఖానాల ద్వారా అందించే భోజనం కోసం ప్రభుత్వం సంవత్సరానికి రూ.3866 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. హరీశ్‌రావు ఆరోగ్య మంత్రి అయిన తర్వాత వైద్య అవసరాలు తెలుసుకుని అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి డాక్టర్ శ్రీతి మీనా, ఛాతీ దవాఖానా సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ ఖాన్, కార్పొరేటర్ దేదీప్య, డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి మారు పేరు సీఎం కేసీఆర్ : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మే 12: జీహెచ్ఎంసీ పరిధిలోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల వెంట ఉండే సహాయకులకు మూడు పూటలా భోజనం అందించే కార్యక్రమం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ గొప్ప మానవతావాది.

మానవత్వానికి మారు పేరు సీఎం కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. ఉస్మానియా ఆస్పత్రిలో మూడు పూటలా భోజనం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రం వచ్చిన తొలి రోజుల్లోనే పేదలు కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కిలో బియ్యాన్ని ఒక్క రూపాయికే అందించారని మంత్రి తెలిపారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాత్రం ఎంత మంది ఉన్న ఒక్కొక్కరికి 4 కేజీల చొప్పున.. మొత్తం 20 కేజీలకు మించకుండా ఇచ్చేవారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో ఒక్కో విద్యార్థికి 200 గ్రాముల చొప్పున ఆహారం అందించేవారు. అర్రాకలితో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, సన్న బియ్యంతో భోజనం పెట్టాలని కేసీఆర్ ఆదేశించారు. ఇవాళ అన్ని హాస్టళ్లలో సన్నబియ్యంతో తిన్నంత భోజనం పెడుతున్నారు.

కేసీఆర్ గతంలో ఆస్పత్రులను సందర్శించినప్పుడు రోగుల సహాయకుల బాధలను గమనించారు. తద్వారా రోగుల సహాయకులకు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద నైట్ షెల్టర్లు నిర్మించాలని ఆదేశించారు.

ఆ పని కొన్ని చోట్ల పూర్తయిందన్నారు. రోగుల సహాయకులకు కూడా భోజనం అందించాలని సూచించారు. ఈ క్రమంలోనే రోజుకు 20 వేల మందికి రూ. 5 కే అన్నం పెట్టే కార్యక్రమం ఇవాళ ప్రారంభమైంది. హరే రామ హరే కృష్ణ సంస్థతో ఒప్పందం చేసుకుని ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రతి భోజనం మీద రూ. 21 చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కార్యక్రమానికి రూ. 40 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశాం. ఒక వేళ ఖర్చు పెరిగినా కూడా ప్రభుత్వం భోజనం పెట్టేందుకు వెనుకాడదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

మౌలిక వసతుల్లో ముందున్న హైదరాబాద్: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే 12: మౌలిక వసతుల్లో దేశంలోని ఇతర నగరాల కంటే హైదరాబాద్ ముందున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. నివాసయోగ్యమైన నగరాల్లోనూ హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. నగరంలోని రాయదుర్గంలో ఉన్న నాలెడ్జ్ సెంటర్‌లో అమెరికాకు చెందిన కాల్‌అవే గోల్ఫ్ సంస్థ కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కాల్‌అవే సంస్థ ఆఫీస్ ఏర్పాటవడం సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణలో డిజిటెక్ కంపెనీలు చాలా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. శాండియాగోలో క్వాల్కం కేంద్ర కార్యాలయం ఉంది. సంస్థ తన రెండో పెద్ద కార్యాలయం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఆపిల్, గూగుల్, ఉబర్, నోవార్టిస్ వంటి సంస్థలు నగరానికి వచ్చాయని చెప్పారు. ఆయా సంస్థల రెండో పెద్ద క్యాంపస్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అమెజాన్ అతిపెద్ద సెంటర్ నగరంలో ఉన్నదని చెప్పారు. కాల్‌అవే కూడా మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరుకుంటున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు.

కాల్‌అవే గోల్ఫ్ సంస్థ హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో అతిపెద్ద డిజిటెక్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నది. దీనిద్వారా సుమారు 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

బైక్‌పై ఐదుగురి ప్రయాణం.. లారీ ఢీకొని నలుగురు దుర్మరణం

చండీగఢ్, మే 12: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పంజాబ్ టర్న్ తరన్ జిల్లాలో జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కపుర్తలా నుంచి ఫతేబాద్‌కు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో గురుద్వారా బాబా దండియావాలా సమీపంలో వేగంగా వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు సహా దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మరోమహిళ గాయపడగా.. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.లారీ వేగంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం కొద్ది అడుగుల దూరం ఎగిరిపడింది. దీంతో ఇద్దరు పిల్లలు సహా దంపతులు రోడ్డుపై ఎగిరిపడడంతో తీవ్ర గాయాలతో మృతి చెందారు. మరో మహిళ స్వైతం తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమంగా ఉన్నది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ పారిపోలేదని, ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వివరించారు.

ఆహ్వానము

ఉనికి సామాజిక, సాంస్కృతిక వేదిక Reg. 549/2015

ఉనికి సామాజిక సాంస్కృతిక వేదిక

కొమర్రాజు ఫౌండేషన్ సంయుక్తంగా....

KF 921 of 2019

డా. గడ్డం శ్యామల గారి "తూరుపు సింధూరం" కవిత్వ పుస్తకావిష్కరణ

తేది: 14-05-2022, ఉ॥ 10:30ని॥లకు లయన్స్ భవన్ (ఏసి) హాల్, జిల్లా పరిషత్ వెనుక నల్లగొండ

స్వాగతం : బండారు శంకర్

సభాధ్యక్షులు: శ్రీ కందుకూరి శ్రీరాములు, ప్రముఖ కవి, అధ్యాపకులు

ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా. నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు

గౌరవ అతిథి: డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, ప్రసిద్ధ కవి, సాహిత్య చరిత్ర కారులు

విశిష్ట అతిథులు: డా. బెల్లి యాదయ్య, ప్రధానాచార్యులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట; శ్రీ మునాసు వెంకట్, తెలంగాణ జీవ కవి; డా. తండు కృష్ణ కౌండిన్య, తెలుగుశాఖ అధ్యక్షులు, యన్.జి. కళాశాల, నల్లగొండ

అతిథులు: శ్రీ కె.వి. జ్ఞాన కుమార్, అధ్యక్షులు కొమర్రాజు ఫౌండేషన్; శ్రీమతి భానుశ్రీ కాత్యాల్, ప్రముఖ కవయిత్రి, చైర్మన్ ఏ.కె. ఫౌండేషన్

వందన సమర్పణ: కె.వి.యన్. ప్రశాంత్

కలిసి భోజనంచేద్దాం

చరిత్రలో నేటినిజం



కం॥ స్థిర్పును నింపుచు - ఆనతో
మాక్కును జూపించి నట్టి మహాత్మునకున్
కాళ్లేలను జిక్కు రుభవుం
"దాళ్ల నారాయణు" కిదె నాశిశ్రమమున్!!

(మే 13 రచయిత ఆర్కె నారాయణ్ పుణ్యతిథి)

-రాధశ్రీ
సెల్: 9494481210

సమస్యల వలయంలో విశ్వవిద్యాలయాలు

భారత దేశవ్యాప్తంగా 1,043 విశ్వవిద్యాలయాలు విస్తరించి ఉన్నాయి. వీటిలో 54 సెంట్రల్ యూనివర్సిటీలు, 416 స్టేట్ యూనివర్సిటీలు, 125 డీమ్డ్ యూనివర్సిటీలు, 361 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 159 జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన తొలి 500 విశ్వవిద్యాలయాల్లో భారతదేశానికి చెందిన 8 యూనివర్సిటీలు, తొలి 1,000 విశ్వవిద్యాలయాల్లో 35 మాత్రమే ఉండడం మన ఉన్నత విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను ఎక్కిరిస్తున్నాయి. వైభవంగా విశ్వ విజ్ఞానాన్ని పంచిన గత సరస్వతి విశ్వవిద్యాలయాలు నేడు పలు సవాళ్ళ నడుమ దేవుడు లేని ఆలయాలుగా కృంగి కృశించిపోయే దుస్థితికి చేరడం యువభారతానికి శాపంగా మారతున్నది. ఉన్నత విద్యపై ప్రభుత్వ నిధుల కేటాయింపులు గత దశాబ్దకాలంగా బడ్జెట్‌లో 1.5 శాతం కన్న పెరగడం లేదు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 2,482 కోట్లు ఉండగా, 2022-23లో 2,078 కోట్ల మాత్రమే కేంద్ర విద్యాశాఖ కేటాయించడం విచారకరమే కాదు ప్రమాదకరం కూడా. కేటాయింపులు తగ్గడంతో పాటు 25 శాతం విద్యార్థుల ప్రవేశాలను పెంచడం, అధ్యాపకుల సంఖ్యను మాత్రం పెంచకపోవడం విచారకరం.

సమస్యలతో సంసారాలు:

దీనికి తోడుగా యూనివర్సిటీల్లో పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలకు 8 శాతం నిధుల కోతను విధించడంతో గోరుచుట్టుపై రోకలి పోటులా యూనివర్సిటీ విద్య, పరిశోధనలు, మౌళిక వసతులు కొరవడి వెలవెలబోతూ, యువతను ఉన్నత విద్యతో ప్రయోజకులను చేసే యజ్ఞంలో విఫలం అవుతున్నాయి. భారతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అర్హతగల అధ్యాపకుల కొరత, లైబ్రరీ నిధుల కోతలతో జర్నల్స్/పుస్తకాల కొరత, జీతభత్యాల చెల్లింపులో జాప్యం, సౌకర్యాల కొరత, తరగతి గదుల్లో అతిగా విద్యార్థుల సంఖ్య, వసతులులేని హాస్టల్స్, పారిశుధ్యలేమి లాంటి అనేక సమస్యలు చుట్టు ముట్టి విద్యాబోధన, పరిశోధనలు అంతరించే స్థాయికి చేరడం దేశ ప్రగతికే గొడ్డలి పెట్టు కానున్నాయి. విశ్వవిద్యాలయాలు రోజువారి ఖర్చుల నిమిత్తం 2022-23లో 4,900 కోట్లు ఉండగా, 201-22లో 4,693 కోట్ల నిధులు విడుదల చేశారు. ప్రతి పైసకు రాష్ట్ర/కేంద్ర/డీమ్డ్ విశ్వవిద్యాలయాలు శ్రమపడాల్సి వస్తున్నది. దేశ రాజధానిలోని పలు యూనివర్సిటీ నిధుల కొరతతో నేడు కొట్టుమిట్టాడుతున్నాయి. యూజీసీ నుంచి మేజర్, మైనర్ పరిశోధనల ప్రాజెక్టులకు కేటాయింపులు 2016-17లో 42.7 కోట్లు ఉండగా, 2020-21లో 38 కోట్లకు కుదించడం జరిగింది. దేశవ్యాప్త విశ్వవిద్యాలయాల్లో 2.7 శాతం మాత్రమే పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నాయి. బలహీన పాలనా వ్యవస్థల నిర్మాణాలు, రాజకీయ ఒత్తిడిలు, పారదర్శకత/జవాబుదారీతనం లోపించడం, మౌళిక వనరుల అగాధాలు, అధ్యాపకుల ప్రమాణాల్లో కొరతలు, విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తిలో వ్యత్యాసాలు, పరిశోధనా నిధుల కోతలు, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్ లేకపోవడం, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు తరగడం, కనీస అవసరాలకు నిధులు లేకపోవడం లాంటి అనేక తీవ్ర సమస్యల వలయంలో చిక్కుకున్న విశ్వవిద్యాలయాలు యువభారతానికి ఆశించిన స్థాయిలో ఉన్నత విద్యను అందించడంలో విఫలం అవుతున్నాయి.

అవినీతి నీడలు:

విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు అడుగంటుతున్నాయి. నకిలీ డిగ్రీలు, పేపర్ లీకేజీలు, కలుషిత మూల్యాంకన కథనాలు, అవినీతి రాజ్యమేలడం, క్యాంపస్‌లో పోలీసు స్టేషన్లు వెలువడం, భావప్రకటనా స్వేచ్ఛను హరించడం, యువత చుట్టు కంచె కట్టి మేధో విస్తృతిని కుదించడం, ప్రజాస్వామ్య హక్కులకు కత్తెర వేయడం, విశ్వవిద్యాలయాలు అధికార పార్టీల స్థావరాలు కావడం, విసిలు అధికార యంత్రాంగానికి లొంగిపోవడం లాంటివి యువత ఎదుగుదలకు విఘాతాలను కలిగిస్తున్నాయి.

డిజిటల్ స్థాయి బోధనలు:

నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా రాబోయే ఐదు ఏళ్ళలో 600 కోట్లు వెచ్చించనున్నారు. నూతన విద్యావిధానం-2020 అమలు ద్వారా యుభారత మెదడులో క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సామాజిక-మానవీయ-భావోద్వేగ విలువల విత్తులు నాటడం జరగాలని కోరుకుందాం. విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని కాపాడడం, అవసర నిధులను కేటాయించడం, విద్యను పరిశోధనలకు ముడిపెట్టడం, విద్యా ప్రమాణాలు పెంచడం, విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తిని కాపాడటం, పాలనా సంస్కరణలు తేవడం, క్యాంపస్‌లో విద్య వాతావరణాన్ని నెలకొల్పడం, అధ్యాపకుల నియమకాల్లో రాజకీయ జోక్యాన్ని తగ్గించడం, ఆధునిక డిజిటల్ యుగ మేధో వికాసం ఫలించడం, నైపుణ్య యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం, భారతీయ యువత ప్రపంచానికి జ్ఞాన వెలుగులు పంచడం జరగాలి. ఇదే విధంగా ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేస్తే యువశక్తి నిర్వీర్యం కావడం, అశాంతితో ఎదురు తిరగడం, నిరుద్యోగం పేట్రేగి పోవడం జరిగే ప్రమాదం నుంచి పాలకులు సరైన పరిష్కారాలు చూపాలి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రూ.434 కోట్ల విలువైన 62 కిలోల హెరాయిన్ సీజ్!

న్యూఢిల్లీ, మే 12: ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రూ.434 కోట్ల విలువైన 62 కిలోల హెరాయిన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ బ్యాగ్స్‌లో మాదక ద్రవ్యాలను నింపి అధికారుల కండ్లు కప్పి దేశంలోకి తరలించేందుకు డ్రగ్ మాఫియా ఆగడాలను డీఆర్ఐ సిబ్బంది భగ్నం చేసింది. భారత్‌లో కొరియర్, కార్గో, ఎయిర్ ప్యాసెంజర్ మార్గాల్లో హెరాయిన్‌ను భారీస్థాయిలో సీజ్ చేయడం ఇదే తొలిసారని ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

ఈ దాడుల్లో రాబట్టిన సమాచారం ఆధారంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోనూ మరో ఏడు కిలో హెరాయిన్ రూ.50 లక్షల నగదు పట్టుబడింది. పట్టుబడిన 62 కిలోల హెరాయిన్ విలువ మార్కెట్‌లో రూ 434 కోట్లు ఉంటుందని అంచనా. ఇక కన్‌సైన్‌మెంట్ దిగుమతిదారును డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

2022-24 సంవత్సరానికి ఆసియా ఎన్నికల అధికారుల సంఘం (ఏఏఈఏ)కి భారతదేశం అధ్యక్ష హోదాకు ఎన్నికైంది

న్యూఢిల్లీ, మే 12:మే 7, 2022న ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరిగిన ఎగ్జిక్యూటివ్ బోర్డ్ అండ్ జనరల్ అసెంబ్లీ సమావేశంలో 2022-2024 కోసం అసోసియేషన్ ఆఫ్ ఆసియా ఎలక్షన్ అథారిటీస్ (ఏఏఈఏ)కి భారతదేశం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల కమిషన్, మనీలా ఏఏఈఏకి ప్రస్తుతం అధ్యక్ష హోదాలో ఉంది. ఎగ్జిక్యూటివ్ బోర్డులో ఇప్పుడు రష్యా, ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, మాల్దీవులు, తైవాన్ మరియు ఫిలిప్పీన్స్‌లు కొత్త సభ్య దేశాలుగా ఉంటాయి.

డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ శ్రీ నితేష్ వ్యాస్ నేతృత్వంలోని భారత ఎన్నికల కమిషన్ 3 సభ్యుల ప్రతినిధి బృందం మణిపూర్ సిఇఒ శ్రీ రాజేష్ అగర్వ్ మరియు రాజస్థాన్ సిఇఒ శ్రీ ప్రవీణ్ గుప్తాతో పాటు మనీలాలో జరిగిన ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశానికి హాజరై 2022-23కి సంబంధించిన వర్క్ ప్లాన్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ బోర్డుకి 2023-24 కోసం భవిష్యత్తు కార్యకలాపాలకు సంబంధించిన నివేదికను కూడా అందించింది. సమ్మిళిత మరియు భాగస్వామ్య ఎన్నికల కోసం మరియు రాజకీయ ప్రక్రియలలో సామాజిక-రాజకీయ అడ్డంకులను ఛేదించడానికి భారతదేశం చేసిన వివిధ సమిష్టి మరియు లక్ష్య జోక్యాలను హైలైట్ చేస్తూ 'ఎన్నికలలో లింగ సమస్యలు'పై ఒక ప్రదర్శన కూడా ఇవ్వబడింది.

సుపరిపాలనకు మద్దతిచ్చే లక్ష్యంతో బహిరంగ మరియు పారదర్శక ఎన్నికలను ప్రోత్సహించే మార్గాలపై చర్చించడానికి మరియు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఎన్నికల అధికారుల మధ్య అనుభవాలు మరియు ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడానికి ఆసియా ప్రాంతంలో పక్షపాత రహిత ఫోరమ్‌ను అందించడం ఆసియా ఎన్నికల అధికారుల సంఘం యొక్క లక్ష్యం.

అనేక ఏఏఈఏ సభ్య దేశాల అధికారులు ఎప్పటికప్పుడు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) నిర్వహిస్తున్న అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. 2019 నుండి ఏఏఈఏ సభ్య దేశాల నుండి 250 కంటే ఎక్కువ మంది అధికారులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఐఐఐడీఈఎం నిర్దిష్ట ఏఏఈఏ సభ్య దేశాల కోసం అనుకూలీకరించిన సామర్థ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంది. బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్‌లోని 50 మంది అధికారులు 2021-22లో శిక్షణ పొందారు.

భారత ఎన్నికల సంఘం నిర్వహించే అంతర్జాతీయ ఎన్నికల సందర్శకుల కార్యక్రమంలో ఏఏఈఏ నుండి ప్రతినిధులు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారు. 2022లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈసీఐ నిర్వహించిన 3వ అంతర్జాతీయ వర్చువల్ ఎలక్షన్ విజిటర్స్ ప్రోగ్రామ్ (ఐఈవిపి)లో 12 ఏఏఈఏ సభ్య దేశాల నుండి 62 మంది అధికారులు పాల్గొన్నారు. 118 సభ్య దేశాల వరల్డ్ ఎలక్షన్ బాడీస్ (ఏ-డబ్ల్యూఈబీ)లో ఏఏఈఏ అసోసియేట్ మెంబర్‌గా కూడా ఉంది.

జనవరి 26-29, 1997లో ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరిగిన ఇరవై ఒకటవ శతాబ్ద ఆసియా ఎన్నికలపై జరిగిన సింపోజియంలో పాల్గొనేవారు ఆమోదించిన తీర్మానం ప్రకారం 1998లో అసోసియేషన్ ఆఫ్ ఆసియా ఎలక్షన్ అథారిటీస్ (ఏఏఈఏ) స్థాపించబడింది. ప్రస్తుతం 20 ఆసియా ఈఎంబిలు ఏఏఈఏ సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈసీఐ ఏఏఈఏ యొక్క వ్యవస్థాపక సభ్యత్వం మరియు 2011-13 సమయంలో వైస్ చైర్‌గా మరియు 2014-16లో చైర్‌గా ఏఏఈఏ యొక్క ఎగ్జిక్యూటివ్ బోర్డ్‌లో కూడా పనిచేసింది.

హైదరాబాద్‌లో విషాదం.. ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్న ఓ వ్యక్తి పెళ్లి సమస్య

హైదరాబాద్, మే 12: ఓ యువకుడికి పెళ్లి కావట్లేదని తల్లి, సోదరి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఎన్ని సంబంధాలు చూసినా అన్ని విఫలం అవుతుండటంతో.. చేసేదేమీ లేక తనువు చాలించాలనుకున్నారు. దీంతో 18 నెలల పసిబాబు గొంతు నులిమి, తల్లీబిడ్డ ఉరేసుకున్నారు. ఈ విషాద ఘటన బాచుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయక నగర్‌లో చోటు చేసుకుంది.

వినాయక నగర్‌కు చెందిన లలిత(56) అనే మహిళకు కూతురు దివ్య(32), కుమారుడు శ్రీకర్ ఉన్నారు. దివ్యకు పెళ్లి కాగా 18 నెలల కుమారుడు శివ కార్తీకేయ ఉన్నాడు. ఇక శ్రీకర్‌కు వివాహం కాలేదు. దీంతో అతనికి అనేక పెళ్లి సంబంధాలు చూశారు. కానీ ఏ ఒక్కటి కూడా సెట్ కావడం లేదు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై లలిత, దివ్య ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఇక బుధవారం రాత్రి లలిత, దివ్య కలిసి శివకార్తీకేయను గొంతు నులిమి చంపారు. అనంతరం వారిద్దరూ ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. లలిత చనిపోయింది. అయితే దివ్య ఉరేసుకున్న చీర చినిగిపోవడంతో కింద పడిపోయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. తల్లి, మేనల్లుడి మృతదేహాలను చూసి షాకైన శ్రీకర్.. బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముందు చూపుతో.. అభివృద్ధి పనులు చేస్తున్నాం

హైదరాబాద్, మే 12: ముంపు సమస్య లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయ నగర్‌లో రూ.3కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను బుధవారం సాయంత్రం ఎమ్మార్డీసీ చైర్మన్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు చూపుతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రీజనల్ రింగ్‌రోడ్ లోపల మరో 50ఏండ్లు నీటి సమస్య లేకుండా సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎస్ఆర్‌డీపీలో భాగంగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. ముంపు నివారణకు రూ.800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. మంచి విజన్ ఉన్న నాయకుడు సుధీర్‌రెడ్డి అని, ఆయన నాయకత్వంలో ఎల్బీనగర్ సమగ్రాభివృద్ధి చెందుతున్నదని తెలిపారు.

పక్కా ప్రణాళికతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పతుల్లా గూడలో మూడు శ్మశాన వాటికలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయ రహదారి పక్కన బస్ టెర్మినల్ నిర్మిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ వస్తున్నామని, ఇక రిజిస్ట్రేషన్ల సమస్య మాత్రమే మిగిలి ఉందన్నారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక జీవో తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, త్వరలోనే ఆ తీపి కబురు కూడా వింటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్ గుప్త, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, త్రినేత్రాంజనేయ దేవస్థానం చైర్మన్ కొత్త శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్నాటి అనిల్ చౌదరి, కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.434 కోట్ల విలువ చేసే 62 కేజీల హెరాయిన్‌ను పట్టుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, మే 12:మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై అణిచివేతను కొనసాగిస్తూ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) మరో వినూత్న కార్యనిర్వహణ పద్ధతిని వెలికితీసింది. ఎయిర్ కార్గో సరుకును నిషేధించిన తర్వాత 10.05.2022 రోజున 62 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. భారతదేశంలో కొరియర్/కార్గో/ఎయిర్ ప్యాసింజర్‌ల ద్వారా ఇప్పటి వరకు జరిగిన హెరాయిన్ స్వాధీనాల్లో ఇది అతిపెద్ద వాటిల్లో ఒకటి .

"బ్లాక్ ఉ వైట్" అనే ఆపరేషన్ కోడ్ ద్వారా, డీఆర్ఐ దిగుమతి చేసుకున్న కార్గో సరుకు నుండి 55 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది, అందులో "ట్రాలీ బ్యాగ్స్'' ఉన్నట్లు ప్రకటించారు. ఉగాండాలోని ఎంటెబ్బే నుండి హెరాయిన్ దుబాయ్ మీదుగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయం చేరుకుంది. పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో స్విఫ్ట్ ఫాలో-అప్ ఆపరేషన్లు మరో 7 కిలోల హెరాయిన్ మరియు రూ. 50 లక్షల నగదు. స్వాధీనం చేసుకున్న 62 కిలోల హెరాయిన్ విలువ అక్రమ మార్కెట్‌లో రూ. 434 కోట్లు ఉంది.

దిగుమతి చేసుకున్న సరుకులో 330 ట్రాలీ బ్యాగులు ఉండగా, స్వాధీనం చేసుకున్న హెరాయిన్‌ను 126 ట్రాలీ బ్యాగ్‌ల బోలు మెటల్ ట్యూబ్‌లలో దాచి ఉంచినట్లు గుర్తించారు. వీటిని దాచడం గుర్తించడం చాలా కష్టం.

డీఆర్ఐ అధికారులు ఈ సరుకును దిగుమతి చేసుకున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఇతర అనుమానితులను కూడా విచారిస్తున్నారు. తదుపరి విచారణలు జరుగుతున్నాయి.

2021లో డీఆర్ఐ దేశవ్యాప్తంగా హెరాయిన్‌ను భారీగా స్వాధీనం చేసుకుంది. 2021లో 3,300 కిలోల కంటే ఎక్కువ హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా, జనవరి 2022 నుండి, డీఆర్ఐ, న్యూఢిల్లీలోని ఐసీడీ తుగ్లక్‌బాద్‌లోని ఒక కంటైనర్‌లో 34 కిలోలు, ముంద్రా పోర్ట్‌లోని ఒక కంటైనర్ నుండి 201 కిలోలు మరియు 392 కిలోల నూలుతో సహా హెరాయిన్‌ను . పిపావావ్ పోర్ట్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. గత మూడు నెలల్లో, అనేక కేసులు కూడా బుక్ చేయబడ్డాయి, విమాన ప్రయాణికుల నుండి 60 కిలోల కంటే ఎక్కువ హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సంస్కృతం మరియు హిందీ భాషలలో పండితుడు డాక్టర్ రామా కాంత్ శుక్లా కన్నుమూత పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 12:సంస్కృతం మరియు హిందీ భాషల లో పండితుడు డాక్టర్ రమా కాంత్ శుక్ల గారి కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర దుఃఖాన్ని వ్యక్తం చేశారు.

"సంస్కృత సాహిత్య జగతి కి మరియు హిందీ సాహిత్య జగతి కి అమూల్యమైనటువంటి సేవల ను అందించిన డాక్టర్ రమా కాంత్ శుక్ల గారి మరణం అత్యంత దుఃఖం కలిగించింది. ఈ శోక ఘడియ లో ఆయన కుటుంబాని కి మరియు ఆయన అభిమానుల కు ఇదే ప్రగాఢ సంతాపం. ఓం శాంతి." అని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్గో ద్వారా భక్తులకు వేములవాడ రాజన్న ప్రసాదం : సజ్జనార్

రాజన్న సిరిసిల్ల, మే 12:(నేటినిజం ప్రతినిధి):ఆర్టీసీ కార్గో ద్వారా రాజన్న ప్రసాదాన్ని భక్తులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఏడాదిన్నర కార్గో ద్వారా రాష్ట్ర ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.100కోట్ల ఆదాయం కార్గో ద్వారా ఆర్టీసీ గడించిందని, సమ్మక్క-సారక్క జాతరలో బంగారం కోసం కార్గోకు ఆదరణ లభించిందని చెప్పారు. భద్రాద్రి సీతారాముల కల్యాణానికి సంబంధించి తలంబ్రాల కోసం లక్షకుపైగా ఆర్డర్లు వచ్చాయని, జగిత్యాల నుంచి 22 టన్నుల మామిడిపండ్లను కార్గో ద్వారా ప్రజలకు సరఫరా చేసినట్లు చెప్పారు. దేవాదాయ శాఖ కమిషనర్, రాజన్న ఆలయ అధికారులతో చర్చించి రాజన్న ప్రసాదం సైతం కార్గో ద్వారా భక్తులకు అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. కరీంనేగర్ బృందం బాగా పని చేస్తుందని, జిల్లా యంత్రాంగం ఆర్టీసీకి బాగా సహకరిస్తుందన్నారు.

వేములవాడకు టూరిస్ట్ ప్యాకేజీ

వేములవాడ గొప్ప పుణ్యక్షేత్రమని, రాజన్న దర్శనానికి 30వేల మంది వస్తుండగా.. 9వేల మంది ఆర్టీసీ దర్శనానికి వస్తున్నారని చెప్పారు. వేములవాడతో పాటు దగ్గరలో ఉన్న ఆలయాలతో కలిపి టూరిస్ట్ ప్యాకేజీ రూపొందిస్తామని, గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్టీసీకి మంచి ఆదరణ ఉందని సజ్జనార్ పేర్కొన్నారు. ప్రయాణికులను ఆకర్షించే విధంగా మరింత నూతన ఆలోచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. కొత్తగా 116 బస్సులను కొనుగోలు చేస్తున్నామని, జిల్లా కేంద్రాల నుంచి ఇతర రాష్ట్రాలకు ఎక్కువ డిమాండ్ ఉన్న వాటిలో వీటిని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్, నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ వాహనాలను నడిపించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి

దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా అధికారులతో కలిసి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని, రాష్ట్రంలో ప్రజలందరికీ ఆర్టీసీ బస్సుతో ఒక అనుబంధం ఉందని, ప్రతి అవసరానికి ఆర్టీసీని వాడుకోవాలని కోరారు. గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి వెళ్లి ఆర్టీసీ పట్ల అవగాహన కల్పిస్తామని సజ్జనార్ తెలిపారు. కాలానుగుణంగా ప్రజలకు సేవలందించేలా ముందుకెళ్తున్నామన్నారు. డీజిల్ భారం కూడా ఎక్కువైందని, దాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. నిపుణుల సహాయం తీసుకొని భారాన్ని తగ్గించుకుంటామన్నారు. 72శాతం ఆక్యుపెన్సీ పెరిగిందని, ఎక్కువ చేసిన కార్మికులకు ఇన్సెంటివ్ ఇస్తున్నామన్నారు. కార్మికులకు వేతనాలు ఒకటో తేదీనే వేస్తున్నామని, ఇటీవల డీఏ సైతం ఇచ్చామన్నారు. నెల రోజుల్లో ఆర్టీసీ యాప్‌ను ప్రారంభిస్తామని, గ్రామీణ ప్రాంతంలోని ప్రయాణికుడు బస్సు ఎక్కడుందో తెలుసుకొని ప్రయాణం చేయవచ్చన్నారు.

రెతిఫైల్ నుంచి 'ఆల్వా' వరకు రోడ్డు వెడల్పు

హైదరాబాద్, మే 12: మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన 10వ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో 10 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. రూ. 43.65 కోట్ల వ్యయంతో ఐదు అభివృద్ధి పనులు, నాలుగు అంశాలు, రోడ్డు వెడల్పునకు సంబంధించిన పనుల కోసం ఆమోదం పొందాయి. ఈ స్టాండింగ్ కమిటీ సమావేశంలో బల్దియా కమిషనర్ లోకేశ్‌కుమార్, ఈఎన్‌సీ జియావుద్దీన్, సీఈ దేవానంద్, సీపీపీ దేవేందర్‌రెడ్డి, అదనపు కమిషనర్ జయరాజ్ కెన్నెడీ, జోనల్ కమిషనర్లు శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పంకజ, మమత, సామ్రాట్ అశోక్, ఎంటమాలజీ చీఫ్ రాంబాబు, అకౌంట్ చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి లక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు పన్నాల దేవేందర్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ సలామ్ షాహిద్, మహపర, బతజబీన్, విజయ్‌కుమార్‌గౌడ్, మహ్మద్ రషీద్ ఫరాజుద్దీన్,ప్రేమ్ కుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఒక ఓటరుకు ఒకేదగ్గర ఓటు

హైదరాబాద్, మే 12: ఒక ఓటరుకు ఒకే చోట ఓటుహక్కు ఉండేలా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలోని రాజకీయ పార్టీ నేతలు, సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ఓటర్ల సవరణ, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వస్తున్న వారు ఇక్కడ ఓటర్లుగా నమోదు అవుతున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి ఇండ్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు వెళ్లి పరిశీలన జరపాలన్నారు. ఓటర్లు కోరుకున్న చోట ఓటుహక్కు ఉంచి ఇతర చోట తొలగించాలని స్పష్టం చేశారు. ఎవరికైనా రెండు చోట్ల ఓట్లు ఉంటే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, వివిధ పార్టీల నేతలు పొన్నాల హరిశ్రీరెడ్డి, సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు.

మన భూగ్రహాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నందుకుగాను అంతర్జాతీయ నర్సుల దినం నాడు నర్సులను ప్రశంసించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 12:మన భూ గ్రహాన్ని ఆరోగ్యం గా ఉంచడం లో ముఖ్య పాత్ర ను పోషిస్తున్నారు అంటూ నర్సుల కు 'అంతర్జాతీయ నర్సుల దినం' నాడు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు.

"నర్సు లు మన భూగ్రహాన్ని ఆరోగ్యం గా ఉంచడం లో కీలకమైన పాత్ర ను పోషిస్తున్నారు. వారి యొక్క అంకితం భావం మరియు దయా గుణం అనుకరణీయమైనటువంటివి. 'అంతర్జాతీయ నర్సుల దినం' సందర్భం మనం మన నర్సింగ్ స్టాఫ్ యొక్క ఉత్కృష్ట కార్యాల ను, చివరకు అత్య

భర్త గల్ఫ్‌లో.. అత్తమామల వేధింపులతో వివాహిత ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల, మే 12:(నేటినిజం ప్రతినిధి):వారిది ప్రేమ వివాహం.. ఆ అన్యోన్య దాంపత్యానికి పండంటి ఇద్దరు కుమారులు. ఆర్థిక ఇబ్బందులతో భర్త గల్ఫ్ వెళ్లడంతో.. భార్య తన ఇద్దరు కుమారులతో కలిసి స్వగ్రామంలోనే ఉంటోంది. అయితే అత్తమామలు ఆమెను వేధింపులకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వివాహిత తన పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయిన్‌పల్లిలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.

బోయిన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మహేందర్, అనూష ఐదేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఇంట్లో ఆర్థిక సమస్యలు వెంటాడుతుండటంతో.. మహేందర్ గల్ఫ్ దేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దీంతో 8 నెలల క్రితం మహేందర్ గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. అప్పట్నుంచి అనూషను అత్తమామలు వేధిస్తున్నారు. మహేందర్, అనూష పెళ్లి చేసుకున్న నాటినుంచే ఆమె వేధింపులకు మొదలైనప్పటికీ, భర్త గల్ఫ్ వెళ్లినప్పటి నుంచి అధికమయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అనూష తన ఇద్దరు పిల్లలను తీసుకొని గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఇద్దరు పిల్లలను బావిలోకి తోసేసి తాను ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వ్యవసాయ బావి వద్దకు చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మధ్య ప్రదేశ్ స్టార్ట్-అప్ కాంక్లేవ్ సందర్భంలో మధ్య ప్రదేశ్ స్టార్ట్-అప్ పాలిసీని ప్రవేశపెట్టనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 12:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022వ సంవత్సరం మే 13వ తేదీ న రాత్రి 7 గంటల కు ఇందౌర్ లో జరుగుతున్న మధ్య ప్రదేశ్ స్టార్ట్-అప్ కాంక్లేవ్ ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అదే కార్యక్రమం లో మధ్య ప్రదేశ్ స్టార్ట్-అప్ పాలిసీని ఆయన ప్రవేశ పెడతారు. అంతేకాకుండా, స్టార్ట్-అప్ ఇకోసిస్టమ్ కు సహాయకారి గా ఉండేటటువంటి ఒక పోర్టల్ ను కూడా ఆయన ప్రారంభిస్తారు.

మధ్య ప్రదేశ్ స్టార్ట్-అప్ కాంక్లేవ్ లో స్టార్ట్-అప్ ఇకో సిస్టమ్ కు చెందిన వివిధ వర్గాలు పాలుపంచుకొంటాయి. ప్రభుత్వం లో విధాన రూపకర్తలు, ప్రైవేటు రంగం లో ప్రముఖులు, నూతన ఆవిష్కర్తలు, నవ పారిశ్రామికవేత్తలు, విద్య రంగ ప్రముఖులు, ఇన్వెస్టర్ లు, మార్గదర్శకులు మరియు ఇతర సంబంధిత ప్రముఖులు ఈ కార్యక్రమం లో భాగస్తులు అవుతారు. ఈ సమావేశం లో వైవిధ్యభరితమైన సదస్సులు జరుగుతాయి. వాటిలో స్పీడ్ మెంటారింగ్ సెషన్ అనేది ఒకటి; దీనిలో భాగం గా విద్య సంస్థల ప్రముఖుల తో మరియు స్టార్ట్-అప్ రంగ ప్రముఖుల తో; స్టార్ట్-అప్స్ భేటీ, స్టార్ట్-అప్ ను ప్రారంభించడం ఎలా? , స్టార్ట్-అప్ లకు విధాన రూపకర్తల మార్గదర్శనం; నవపారిశ్రామికవేత్తల కు వివిధ ఆర్థిక సహాయ లభ్యత పద్ధతుల ను గురించి వివరించే ఒక సదస్సు, మరి అలాగే ఇన్వెస్టర్ లతో కలసి వారి మద్దతు ను పొందడం కోసం స్టార్ట్-అప్స్ వాటి వాటి ఆలోచనల ను వెల్లడించే సదస్సు తో పాటు, మధ్య ప్రదేశ్ లో స్టార్ట్-అప్ ఇకోసిస్టమ్ ను ప్రోత్సహించడం, ఇంకా బ్రాండ్ వేల్యూ ను గురించిన అవగాహన సదస్సు వంటివి చోటు చేసుకొంటాయి. కొత్త కొత్త ఆవిష్కరణలు మరియు నూతన ధోరణుల ను గురించి కళ్ళ కు కట్టే ఒక స్టార్ట్-అప్ ఎక్స్ పో ను కూడా సమావేశ ప్రాంగణం లో ఏర్పాటు చేయడం జరుగుతుంది.

ఆచార్య భగీరథ్ ప్రసాద్ త్రిపాఠీ కన్నుమూత పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మే 12:సంస్కృత వ్యాకరణ పండితుడు ప్రొఫెసర్ భగీరథ్ ప్రసాద్ త్రిపాఠీ కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర దుఃఖాన్ని వ్యక్తం చేశారు. 'వాగీశ శాస్త్రి' గా ప్రొఫెసర్ భగీరథ్ ప్రసాద్ త్రిపాఠీ ప్రసిద్ధిగన్నారు.

"ఆచార్య భాగీరథ్ ప్రసాద్ త్రిపాఠీ 'వాగీశ శాస్త్రి' గారు ఆధునిక విజ్ఞానశాస్త్ర రీతుల ను ఉపయోగించుకొంటూ యువతీ యువకుల లో సంస్కృతాని కి మరింత గా ఆదరణ లభించేటట్లు చూడడాని కి అమూల్యమైనటువంటి తోడ్పాటు ను అందించారు. ఆయన అత్యంత జ్ఞాని యే కాక విద్వాన్ కూడా ను. ఆయన మరణం తో దు:ఖిస్తున్నాను. ఆయన కుటుంబాని కి మరియు ఆయన స్నేహితుల కు ఇదే నా సంతాపం. ఓం శాంతి." అని పేర్కొన్నారు.

లోకమాన్య తిలక్ రైలును తిరిగి ప్రారంభించాలి : బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్ , మే 12:కరీంనగర్ నుంచి ముంబైకి వెళ్లే లోకమాన్య తిలక్ రైలును పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ రైల్వే బోర్డు చైర్మన్ వినయ్ కుమార్ త్రిపాఠి ను కోరారు. ఎకరీంనగర్ నుంచి బయలుదేరి జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా ముంబైకి వెళ్లే లోకమాన్య తిలక్ రైలు కరోనా మహమ్మారి ప్రబలిన సందర్భంగా మొదటి దఫా లాక్ డౌన్ సమయంలో ఈ రైలు సర్వీసులను రైల్వే బోర్డు నిలిపివేసిందని వినోద్ కుమార్ తెలిపారు.

తాను కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో లోకమాన్య తిలక్ రైలును కరీంనగర్ నుంచి ముంబైకి ప్రారంభించినట్లు వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ రైలు సేవలు నిలిచిపోవడంతో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లా ప్రజలకు ముంబైకి నేరుగా వెళ్లే అవకాశాలు లేకుండా పోయాయని వినోద్ కుమార్ వివరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెంటనే లోకమాన్య తిలక్ రైలు సేవలను తిరిగి ప్రారంభించాలని వినోద్ కుమార్ రైల్వే బోర్డు చైర్మన్ వినయ్ కుమార్ త్రిపాఠి ని కోరారు.

రుషికొండ తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ స్టే - అధికార పార్టీకి షాక్



అమరావతి, మే 12:ప్రకృతి అందాలకి నెలవుగా నెలకొంది విశాఖపట్నం..పలు బీచ్ ల పేరుతో పర్యాటక ప్రేమికులని ఆకర్షిస్తుంటుంది. విశాఖలో ఎన్నో బీచ్ లు ఉన్నాయి. వాటిల్లో ఒకటి రుషికొండ. కాగా రుషి కొండ వద్ద పర్యాటక ప్రాజెక్టుల పేరిట భారీ ఎత్తున తవ్వకాలకు తెర తీశారు. అయితే ఆ తవ్వకాలకు సడెన్ గా బ్రేక్ పడిపోయింది. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఈ తవ్వకాల మీద స్టే విధించింది. దాంతో ఒక విధంగా ఇది అధికార పార్టీ ప్రయత్నాలకు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. నిజానికి రుషికొండ వద్ద తవ్వకాలు అన్నీ పర్యావరణ నిబంధనలకు విరుద్ధమని ..టీడీపీ.. జనసేన రెండూ కూడా ఇప్పటికే అన్ని రకాలుగా పోరాటాలు చేపడుతూ వచ్చాయి.

ఈ మధ్య టీడీపీ అధినేత చంద్రబాబు విశాఖ వచ్చినపుడు రుషికొండ తవ్వకాలను పరిశీలించాలనుకున్నారు. దానికి పోలీసులు అడ్డుచెప్పడంతో బాబు ఆగ్రహించారు. కొండని పిండి చేసి పెద్దలు మింగాలని చూస్తున్నారు. నిజంగా అక్కడ టూరిజం ప్రాజెక్టులే కడుతూంటే ఎందుకు చూపించరని మండిపడ్డారు. మేం కనుక అధికారంలోకి వస్తే కొండని పిండి చేసి మింగేసిన వారి నుంచి అంతకు అంతా కక్కించి తీరుతామని కూడా స్పష్టం చేశారు. ఇక విశాఖ తీర ప్రాంతంలో ఉన్న కొండలే కొండంత రక్షణ. 2014లో హుదూద్ తుఫాన్ విశాఖను ఉఫ్ అని ఊదేయకుండా కాపాడిన ఘనత కూడా ఈ కొండలదే. అలాంటి కొండల వద్ద ఎలాంటి పర్యావరణ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు ఉన్నాయి. అయితే వాటిని కాలదన్ని ఇష్టం వచ్చినట్లుగా కొండను తవ్విపడేస్తున్నారు అని టీడీపీ నేతలు గట్టిగానే ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో రుషికొండ తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ స్టే విధించింది. అంతే కాదు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తవ్వకాలు జరపరాదని ఆదేశించింది. ఇక ఈ అంశం మీద వైసీపీకి చెందిన ఎంపీ రఘురామకృష్ణ రాజు వేసిన పిటిషన్ పై విచారణ జరిపిన ఎన్జీటీ ఇప్పటివరకు జరిగిన తవ్వకాలపై పూర్తి స్థాయి అధ్యయనానికి సంయుక్త కమిటీని నియమించింది.

దుండిగల్‌ను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, మే 12:దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ 12వ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణికృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది.ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రూ,10కోట్ల 83లక్షల 40వేల నిధులతో అభివృద్ధి చేయనున్న గండిమైసమ్మ చౌరస్తా,మల్లంపేట్, బౌరంపేట, గాగిల్లాపూర్,బహదూర్‌పల్లిలో వర్షపునీటి కాలువల ఏర్పాటు,మల్లంపేట్, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లిలో వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటు,శ్మశాన వాటికల అభివృద్ధి, అదే విధంగా మున్సిపల్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్య,డ్రైనేజీ లైన్లు,తాగునీటి పైపులైన్లు,రోడ్ల ఏర్పాట్లపై చర్చించారు.అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని ప్రధాన జంక్షన్ల అభివృద్ధిపై దృష్టి సారించారని,అందులో భాగంగా భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని గండిమైసమ్మ చౌరస్తాను విస్తరించనున్నామని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ దూర దృష్టితో నగరం చుట్టు పక్కల నీటి ప్రాజెక్ట్‌లను నెలకొల్పారని,వాటిని అధికారులు సద్వినియోగం చేసుకునేందుకు నీటి ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు.గతంలో నిర్వహించిన పట్టణ ప్రగతిలో అనేక అభివృద్ధి పనులు పూర్తిచేయడం జరిగిందని,ఈ నెల 20న తిరిగి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. దుండిగల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నిధులు లేమి లేకుండా పూర్తయ్యేలా సహకరిస్తానని, రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని అభివృద్ధికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, గండిమైసమ్మ-దుండిగల్ మండలం తహసీల్దార్ భూపాల్, మున్సిపల్ మేనేజర్ సునంద,డీఈ చిరంజీవులు,ఏఈ నవీన్‌కుమార్,కౌన్సిలర్లు,సిబ్బంది ఉన్నారు. కాగా సమావేశానికి హాజరు కాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మానవీయ కోణంలో సేవలందిస్తున్న నర్సులు : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట, మే 12: జిల్లా కేంద్రానికి నర్సింగ్ కళాశాల మంజూరు అయిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి వెల్లడించారు. అనువైన భవనం లభ్యమైతే ఈ సంవత్సరం నుంచే నర్సింగ్ కళాశాల ప్రారంభం కానుందని ఆయన ప్రకటించారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నర్సుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నర్సింగ్ వృత్తికి మరే వృత్తి సాటి రాదన్నారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రోగాలతో ఇబ్బంది పడుతున్న రోగులను రక్తసంబంధీకులు సైతం దూరం పెట్టే తరుణంలో ఎన్నో కష్టాలను ఓర్చి సేవలందిస్తున్న వారు నర్సులని ఆయన కొనియాడారు. రోగాల బారిన పడి దుర్గంధం వస్తున్నా ఖాతరు చెయ్యకుండా అక్కున చేర్చుకున్న వారే నర్సులని ఆయన పేర్కొన్నారు.

వైద్యులతో సరి సమానంగా పోటీ పడి వైద్యులు వచ్చేసరికి రోగులను సంసిద్ధం చేయడంలో వారికి వారే సాటి అని ఆయన కితాబిచ్చారు. అలాంటి సేవలు అందిస్తున్నందునే కొవిడ్ సమయంలో అవార్డ్ సాధించుకున్నామని ఆయన గుర్తుచేశారు. డెలివరీ అంటేనే సిజేరియన్ గా పేరుబడ్డ పరిస్థితుల నుంచి సాధారణ ప్రసవాల డిమాండ్ పెరగడం చూస్తుంటే ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, నర్సులు అందిస్తున్న సేవలే ప్రధాన కారణమని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, స్థానిక జడ్పీటీసీ జీడీ భిక్షం, పెనపహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, డీఎంహెచ్‌వో కోటాచలం, దవాఖాన సూపరింటెండెంట్ దండ మురళీధర్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పోషక ఉద్యాన వనాన్ని ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, మే 12: జిల్లాలోని సారంగపూర్ మండలం ఆలూర్‌లోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో పోషక ఉద్యాన వనాన్ని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. గురువారం సారంగాపూర్ మండలం ఆలూరు బృహత్ పల్లె ప్రకృతి వనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, సమగ్ర శిశు మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 'పోషక ఉద్యానవనం', 'మన అంగన్‌వాడీలు- మన ఆకుకూరలు' అనే కార్యక్రమాన్ని పల్లె ప్రకృతి వనంలో విత్తనాలు చల్లి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రయోగాత్మకంగా ఆలూరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇందులో ఎకరంలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండిస్తారన్నారు. ఇక్కడ పండిచిన కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారని మంత్రి తెలిపారు.ఇందులో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ అంగన్‌వాడీల ద్వారా అందజేస్తామన్నారు. అంతకుముందు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీఓ, ఎంపీవో, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

22 మంది ఇన్స్‌పెక్టర్ల బదిలీ.. ఉత్తర్వులిచ్చిన అడిషనల్ డీజీ నాగిరెడ్డి

కరీంనగర్ , మే 12:మల్టి జోన్-1 పరిధిలో పని చేస్తున్న 22 మంది ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ అడిషనల్ డీజీ నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం సీఎస్‌బీలో పనిచేస్తున్న సీహెచ్. విద్యాసాగర్‌ను చెన్నూరు (కోటపల్లి సీఐగా), కోటపల్లి సీఐగా పని చేస్తున్న నాగరాజును కాగజ్‌నగర్ రూరల్‌కు బదిలీ చేశారు. కొత్తగూడెం ఎస్‌పీ అటాచ్డ్‌గా ఉన్నముస్కు అబ్బయ్యను కొత్తగూడెం మూడో ఠాణాకు, కొత్త గూడెం మూడో ఠాణాలో పని చేస్తున్న వేణుచందర్‌ను కొత్తగూడెం డీసీఆర్‌బీకి, తొర్రూర్‌లో పని చేస్తున్న కరుణాకర్ ను మంచిర్యాల సైబర్ క్రైమ్‌కు, కరీంనగర్‌లో అటాచ్డ్‌గా ఉన్న కే. జితేందర్‌ను ఆసిఫాబాద్ సీసీఎస్‌కు, రెబ్బన సీఐగా పని చేస్తున్న సతీష్‌కుమార్‌ను మంచిర్యాల పీసీఆర్‌కు, రామగుండం టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న మహేందర్‌ను నిర్మల్ డీసీఆర్‌బీకి, మంచిర్యాల పీసీఎస్‌లో పనిపి చేస్తున్న అల్లం నరేందర్‌ను రెబ్బనకు, మంచిర్యాల సైబర్ క్రైమ్‌లో పని చేస్తున్న యాంబాడి సత్యనారాయణను తొర్రూరుకు బదిలీ చేశారు.

ఇక.. పెద్దపల్లి సైబర్ క్రైమ్‌లో పని చేస్తున్న బద్దని శ్రీనివాస్‌ను వాంకిడికి, ఆసిఫాబాద్‌లో పని చేస్తున్న ఆకుల అశోక్‌ను రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు, వాంకిడి సీఐగా పని చేస్తున్న సుధాకర్‌ను ఆసిఫాబాద్ సీసీఎస్‌కు, ఆసిఫాబాద్ సీసీఎస్‌లో పని చేస్తున్న రాణాప్రతాప్‌ను ఆసిఫాబాద్‌కు, వరంగల్‌లో పని చేస్తున్న బాలాజీ వరప్రసాద్‌ను ఆదిలాబాద్ వీఆర్‌కు, నిర్మల్ డీసీఆర్‌బీలో పని చేస్తున్న శ్రీనివాస్‌ను కామారెడ్డి రూరల్‌కు, వరంగల్ కమిషనరేట్‌లో పని చేస్తున్న హనుమాన్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు, కొత్తగూడెం వీఆర్‌లో ఉన్న పుల్లయ్యను కరీంనగర్ వీఆర్‌కు, కాగజ్‌నగర్ రూరల్‌లో పని చేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను రామగుండం సైబర్ క్రైమ్‌కు, కొత్తగూడెం డీసీఆర్‌బీలో పని చేస్తున్న బాలకిషన్‌ను అశ్వరావుపేటకు, అశ్వరావుపేటలో పని చేస్తున్న ఉపేందర్‌రావును కొత్తగూడెం వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈశాన్య భారత్ అపరిమిత అవకాశాల భూమిగా అన్వేషించని స్వర్గంగా ప్రపంచంలో ఓ బ్రాండ్

న్యూఢిల్లీ, మే 12:విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇన్వెస్ట్ ఇండియా 'రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఆఫీసర్స్' సమావేశాన్ని నిర్వహించింది. ఈశాన్య ప్రాంత అభివృద్ధి, పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఇందులో ప్రసంగించారు. ఈ సదస్సుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ప్రముఖులు, దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు, వివిధ విభాగాలకు చెందిన పెట్టుబడిదారులు హాజరయ్యారు. ఈ ప్రాంతంలో ఏర్పడిన సానుకూల వృద్ధి-ఆధారిత వాతావరణం కారణంగా ఈశాన్య ప్రాంతంలో పెట్టుబడిదారులకు పెరుగుతున్న అవకాశాలపై మంత్రి మాట్లాడారు. భద్రతా పరిస్థితిలో మెరుగుదల, మెరుగైన కనెక్టివిటీ మరియు అసమానమైన రాజకీయ సంకల్పం ఈ ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించడం అభివృద్ధి మరియు అభివృద్ధి శకానికి ఎలా నాంది పలికిందో కూడా ఆయన వివరించారు.

ఇటీవలి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ - నార్త్ ఈస్ట్ ఫెస్టివల్, ఏప్రిల్ 28 నుండి మే 4 వరకు జరుపుకుందని మంత్రి తెలిపారు. ఇది అనేక క్లిష్టమైన సమస్యలపై తెలుసుకోవడంలో సహాయపడిందని, విధాన రూపకర్తలకు, సాధారణ ప్రజలకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చిందని మంత్రి చెప్పారు. చర్చల అంతటా, ఈ ప్రాంతాన్ని బలోపేతం చేయడానికి రెండు అంశాలు ప్రాథమికమైనవిగా గుర్తించబడ్డాయి - ఎక్కువ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం మరియు పర్యాటకం, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయం, ఉద్యానవనం, పూల పెంపకం, వస్త్రాలు వంటి ఈ ప్రాంతం యొక్క స్వాభావిక సంభావ్యతను ఉపయోగించుకోవడం. హస్తకళలు, ఐటీ, బీపీఓ మరియు సేవల పరిశ్రమ, అంతటా సాధారణమైనవిగా గుర్తించబడ్డాయి.

ఈశాన్య రాష్ట్రాల ఉత్పత్తులకు గణనీయమైన డిమాండ్ ఉందని మరియు ఈశాన్య ప్రాంతం పట్ల విదేశీ పెట్టుబడిదారుల ఆసక్తి ఉందని, అయితే అవగాహన లేకపోవడం, అపోహలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

"ఈశాన్య భారతదేశాన్ని అన్వేషించని స్వర్గంగా మరియు అపరిమిత అవకాశాల భూమిగా" బ్రాండ్‌ను నిర్మించడంలో సహాయం చేయడానికి, ప్రపంచవ్యాప్త ఉనికిని విస్తృతంగా వ్యాప్తి చేయాల్సిందిగా ఐఎఫ్ఎస్ అధికారులందరికీ ఆయన పిలుపునిచ్చారు. సాంస్కృతిక పర్యాటక రాజధాని అయిన ఈశాన్య ప్రాంతానికి అంబాసిడర్‌లుగా మారాలని ఆయన వారిని కోరారు.ప్రపంచ పెట్టుబడి సంఘాలు, పరిశ్రమలు ఈశాన్య భారతదేశం వైపు దృష్టి సారించేందుకు ఐఎఫ్ఎస్ అధికారులు తప్పనిసరిగా ఉత్ప్రేరకంగా ఉండాలనే వాస్తవాన్ని కూడా మంత్రి తెలిపారు.సమిష్టి కృషితో భారతదేశం అమృత్‌కాల్‌ను సద్వినియోగం చేసుకోగలదని, ఈశాన్య ప్రాంత శక్తిని వెలికితీసి, ఆత్మనిర్భర్ భారత్‌లో వృద్ధి ఇంజిన్‌గా నిలబెట్టగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇన్వెస్ట్ ఇండియా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారుల కోసం మిడ్-కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా ఇది జరిగింది. ఇంటరాక్టివ్ సెషన్లలో పెట్టుబడి ప్రమోషన్ మరియు బ్రాండ్ ఇండియాను నిర్మించడానికి ప్రభుత్వం యొక్క ఇతర కార్యక్రమాలపై దృష్టి పెట్టింది.

సాహితీ కిరణం

సాహితీకిరణం సౌజన్యంతో చి॥ జాహ్నవి కొసరాజు(అన్యతాసి) స్మారక జాతీయస్థాయికవితలపోటీ

చి॥ జాహ్నవి కొసరాజు (అన్యతాసి) వర్ధంతి (జులై 15) సందర్భంగా
సాహితీకిరణం సౌజన్యంతో నిర్వహిస్తున్న కవితలపోటీకి కవులు/కవయిత్రులనుండి
కవితలను ఆహ్వానిస్తున్నాము. ఈ పోటీలో 7 బహుమతులుంటాయి

బహుమతి వివరాలు:
ప్రథమ బహుమతి:రూ॥3000/-,
ద్వితీయ బహుమతి రూ॥2000/-
ఒక్కొక్కటి రూ॥1000/- చొప్పున 5 సమాన బహుమతులు,

నియమనిబంధనలు:
1) కవిత ఏ అంశానికైనా చెందినదై ఉండవచ్చు,
2) ప్రతి రచయిత ఒక్క కవితమాత్రమే పంపాలి
3)కవిత 20 లైన్లకు తగ్గకుండా 30లైన్లకు మించకుండా ఉండాలి.
4)కవిత ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం/ప్రసారితం కాలేదనీ, దేనికీ అనుకరణ/అనువాదం కాదనీ, ఏ బ్లాగులోనూ పెట్టలేదనీ, మరెక్కడా పరిశీలనలో లేదనీ హామీపత్రం తప్పనిసరిగా జతపరచాలి,
5)కవిత పంపే కవరుమీద జాహ్నవి కొసరాజు (అన్యతాసి) స్మారక జాతీయస్థాయి కవితలపోటీకి అని రాయాలి,
6)కవి పేరు, చిరునామా, మొబైల్ నెంబరు కవిత ఉన్న పేపరుపై కాకుండా హామీపత్రంపై రాయాలి,
7)కవితలు పోస్టు/కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి, వాట్సప్, మెయిల్‌లో పంపిన కవితలు స్వీకరించబడవు,
8)కవిత ఎ4సైజు తెల్ల కాగితానికి ఒకవైపు మాత్రమే రాయాలి,
9) కవితలు 30.06.2022 లోపు క్రింది చిరునామాకు పంపాలి.

చిరునామా: ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్-500102. సెల్:9490751681

బహుమతి ప్రదాత
సామ్రాజ్యం కొసరాజు

పాత్తూరి సుబ్బారావు
సంపాదకులు

రాజన్న సేవలో టీఎస్ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్

రాజన్న సిరిసిల్ల, మే 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ గురువారం దర్శించుకొని, స్వామివారికి పూజలు చేశారు. ముందుగా ఆయన ఆలయంలోకి రాగానే

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్, ఆలయ ఈఓ రమాదేవి, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ఆర్టీసీ ఎండీకి స్వామి వారి చిత్రపటం, శాలువా, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ సమావేశ మందిరంలో టీఎస్ఆర్టీసీ డిపోల పనితీరును ఎండీ సమీక్షించారు.

పుట్టిన అడబిడ్డలకు ఉయ్యాలల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, మే 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ అయిన ఆడ పిల్లల కు గురువారం ఉయ్యాలలను అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో మొదటి, రెండవ కాన్పులలో పుట్టిన ఆడ పిల్లలకు మాత్రమే ఉయ్యాల అందించడం జరుగుతుందన్నారు. వేములవాడ 100పడకల ఆసుపత్రిలో గర్భవతులకు సేవలందించి, ప్రసూతిలు పెరగడం కొరకు ఇట్టి ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.మహేష్ రావు, డా. దీప్తి, డా.అనిల్ కుమార్,డా.సంతోష్ కుమార్ చారి, డా.వెంకటభరణి,డా. రత్నమాల,ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు పాల్గొన్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో తగ్గుతున్న బంగారం ధర..

న్యూఢిల్లీ, మే 12:భారతీయులకు.. అందునా మహిళలకు బంగారం అంటే ఎంతో ఇష్టం. అందునా ఇప్పుడు పెండ్లిండ్ల సీజన్.. అయినా బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గాయి. మూడు నెలల నాటి స్థాయికి పడిపోయాయి. పెట్టుబడులు పెట్టడానికి కూడా బంగారం స్వర్గధామమే. బుధవారం మల్టీ కమొడిటి ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో జూన్ డెలివరీ పది గ్రాముల బంగారం ధర రూ.50,637 పలికింది. మార్చి నెల ప్రారంభంలో రూ.56 వేల చేరువలోకి వెళ్లిన పసిడి క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఆభరణాల తయారీకి ఉపయోగించే 22-క్యారట్ల పది గ్రాముల బంగారం ధర 46,750 పలికింది. 24 క్యారట్ల తులం బంగారం ధర రూ.51 వేలుగా నమోదైంది. దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పన్నులను బట్టి బంగారం ధరల్లో మార్పులు ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 1832.06 డాలర్లు పలుకుతున్నది.

అమెరికా డాలర్ విలువ 20 ఏండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడటంతో బంగారం గిరాకీ పడిపోయింది. డాలర్లతోపాటు అమెరికా ట్రెజరీ బాండ్ల కొనుగోళ్లకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. గ్లోబల్ రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు తలెత్తినప్పుడల్లా బంగారం సురక్షిత పెట్టుబడి మార్గం అని ఇన్వెస్టర్లు విశ్వసించే వారు. కానీ, గతవారం అమెరికా ఫెడ్ రిజర్వు కీలక వడ్డీరేట్లు పెంచడంతో డాలర్ విలువ పెరిగి బంగారానికి గిరాకీ పడిపోయిందని అంటున్నారు.

సార్థక్ మెటల్స్ లిమిటెడ్ ఆర్థిక ఫలితాల వెల్లడి

హైదరాబాద్, మే 12: కోర్డు వైర్లు మరియు అల్యుమినియం ఫ్లిప్పింగ్ కాయిల్స్ తయారీలో భారత దేశం లోని ప్రముఖ సంస్థలలో సార్థక్ మెటల్స్ లిమిటెడ్ సంస్థ ఒకటి. 31 మార్చి 2022 తో ముగిసిన త్రైమాసికానికి ఆర్థిక ఫలితాలను ప్రకటించినది.

ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ సంజయ్ షా మాట్లాడుతూ " మేము ఖ4ఈజ22 కొరకు మంచి ఫలితాలను సాధించుటకు గడచిన రెండు త్రైమాసికాలలో నిరంతరంగా సామర్థ్యత పెంపుదల కొరకు పనిచేసామని తెలియచేయుటకు సంతోషిస్తున్నము అన్నారు.

ఈ త్రైమాసికం లో కంపెనీ అత్యధికంగా రూ.147.2 కోట్లుగా ప్రకటించినది. ప్రతి సంవత్సరం 129% మరియు 38% సీక్వెన్షియల్ ప్రాతిపదికన పటిష్టమైన వృద్ధిని అందిస్తున్నది అన్నారు. పూర్తి సంవత్సరం ప్రాతిపదికన, ఆర్థిక సంవత్సరం - 22 కొరకు సంస్థ గత ఏడాది రూ.457.3 కోట్లు కంటే రెట్టింపు వృద్ధి చెందినది. ఈ అభివృద్ధి సాధనకు రెండు వాస్తవిక కారణాలు ఏమిటంటే, స్టీల్ రంగం లో మంచి గిరాకి రావటం మరియు అదేవిధంగా మార్కెట్ లో ప్రస్తుతమున్న వాటిలో సార్థక్ మెటల్స్ ఉత్పత్తుల శ్రేణి వాటాలు గణనీయంగా పెరగటం అని చెప్పాలి. లాభాల విషయానికి వస్తే, ఇఎమఆం మార్జిన్ ఆర్థిక సంవత్సరం-21 నందు 7.5% అయితే ఆర్థిక సంవత్సరం-22 నందు 8.7% నకు వృద్ధి చెందాయి. దీనికి వాస్తవికమైన ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు కొన్నినిర్వహణ పద్ధతులు మద్దతు నిచ్చి ఆర్థిక సంవత్సరం-22 కొరకు 244% వృద్ధికి దారి తీసి రూ.27.5 కోట్లు సాధనకు దోహదపడింది.

మా పటిష్టమైన ఆర్థిక పరిస్థితి మరియు బలపడిన బ్యాలన్స్ షీటు ను దృష్టిలో ఉంచుకుని మా వాటాదారులకు రెండవ మరియు చివరి డివిడెండ్ రూ.1/- ప్రకటించాము. వార్షిక సర్వసభ్య సమావేశం లో వాతటాదారుల అనుమతికి లోబడి వార్షిక డివిడెండ్ మొత్తం రూ.2/- అవుతుంది. భారతీయ స్టీల్ పరిశ్రమ అందించే దీర్ఘకాలిక అవకాశాలు వినియోగించుకొవటానికి మరియు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కంపెని ఎదురుచూస్తున్నాది.

అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులతో సదస్సును నిర్వహించిన ఈసీఐ

న్యూఢిల్లీ, మే 12:భారత ఎన్నికల సంఘం ఈ రోజు న్యూఢిల్లీలో అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులతో ఒక సమావేశాన్ని నిర్వహించింది. ఎన్నికల ప్రణాళిక, వ్యయ పర్యవేక్షణ, ఎలక్టోరల్ రోల్, ఐటి అప్లికేషన్లు, డేటా మేనేజ్మెంట్, ఈవీఎం/వీవీప్యాట్, ఫిర్యాదుల సకాలంలో పరిష్కారం, స్వీప్ స్ట్రాటజీ అండ్ ఓటర్ ఔట్రీచ్, మీడియా, కమ్యూనికేషన్ వంటి అంశాలపై థీమాటిక్ డిస్కషన్లతో పాటు ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను, అభ్యసనలను పంచుకోవడానికి రెండు రోజుల సదస్సును నిర్వహించనున్నారు.

సీఈసీ శ్రీ సుశీల్ చంద్ర తన ప్రసంగంలో మాట్లాడుతూ, ఇటువంటి సమావేశాలు అనుభవాలను పంచుకోవడానికి మరియు ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడానికి ఒక శ్రేష్టమైన వేదిక అని అన్నారు. ప్రధాన ఎన్నికల అధికారులను అభినందిస్తూ, మహమ్మారి మధ్య నిర్వహించిన ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఆదర్శప్రాయమైనవని, మునుపటి ఉదాహరణలు లేదా సూచనలు లేవని ఆయన అన్నారు. అసాధారణ పరిస్థితులు భౌతిక ర్యాలీలను నిషేధించడం, డిజిటల్ ప్రచారాలను ప్రోత్సహించడం మరియు క్లిష్టమైన భాగస్వాములతో పరిస్థితిని వారానికొకసారి సమీక్షించడం నుండి అసాధారణ పరిష్కారాలను కోరాయి.

రిజిస్ట్రేషన్ నుండి ఓటింగ్ వరకు మొత్తం ఎన్నికల ప్రక్రియ ద్వారా ఓటర్లకు సేవలను నిరంతరం అప్ గ్రేడ్ చేయాల్సిన అవసరాన్ని సిఇసి శ్రీ చంద్ర నొక్కి చెప్పారు. ఇంకా విపులంగా, సిఇఒ లు రాష్ట్రాల లో భారత ఎన్నిక లక మిషన్ కు ముఖ మైన వారని ఆయన ప్రస్తావించారు. మరియు వారు భాగస్వాములు అందరికీ అందుబాటులో మరియు కనిపించేలా చూడాలి. సందర్భాలను వివరించేటప్పుడు, వ్యవస్థాగత మెరుగుదలలు మరియు ఓటరు సౌకర్యాన్ని మెరుగుపరచడానికి ఈసిఐకి క్రమం తప్పకుండా ఫీడ్ బ్యాక్ అందించాలని ఆయన సిఇఒలను కోరారు. ఎన్నికల నిర్వహణలో తమ అత్యుత్తమ విధానాలు మరియు ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పడానికి తమ ఔట్ రీచ్ మరియు కమ్యూనికేషన్ ను బలోపేతం చేయాలని సిఇఒలను ఆయన కోరారు.

నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన ఈసీ శ్రీ రాజీవ్ కుమార్‌ను సీఈసీ అభినందించింది. అతని నాయకత్వంలో ఈసీఐ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఎన్నికల కమిషనర్ మరియు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ ప్రధాన ఎన్నికల అధికారులతో సంభాషిస్తూ మాట్లాడుతూ, రాజ్యాంగం అందించిన ఆదేశంతో, ఈసీఐ చాలా పటిష్టమైన అంతర్గత యంత్రాంగాలను మరియు పద్ధతులను అభివృద్ధి చేసిందని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రాప్యత మరియు అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రతి ఓటరు భాగస్వామ్య పద్ధతి. గత ఏడు దశాబ్దాల వారసత్వంతో, ఈసీఐ ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఆదర్శప్రాయమైన శక్తివంతమైన మరియు పారదర్శక ప్రక్రియలను ఏర్పాటు చేసింది. ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు బీహార్‌లో మహమ్మారి మధ్య మొదటిసారిగా ఎన్నికలను నిర్వహించిన తన అనుభవాలను వివరిస్తూ, ప్రయాణం సవాళ్లు మరియు అభ్యాసాలతో నిండి ఉందని పేర్కొన్నారు. అపూర్వమైన పరిస్థితి డైనమిక్ నిర్ణయాలను తీసుకోవాలని మరియు తప్పుడు సమాచారంతో కూడిన కథనాలను ముందస్తుగా మార్చాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రక్రియలను మరింత సరళతరం చేసేందుకు శ్రీ చంద్ర హయాంలో ప్రారంభించిన సంస్కరణల ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సీఈవోలను కోరారు.

ఎన్నికల వ్యవస్థ యొక్క ప్రాప్యత మరియు పారదర్శకతను పెంపొందించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించినప్పటికీ, ఓటర్లు, రాజకీయ పార్టీలు మరియు ఎన్నికల నిర్వహణ అధికారులు అనే మూడు కీలకమైన భాగస్వాములపై దృష్టి సారించి మొత్తం ఐటి మౌలిక సదుపాయాలను ఈసిఐ క్రమబద్ధీకరించిందని శ్రీ కుమార్ తన ప్రసంగంలో తెలిపారు. తాజా పురోగతిలకు అనుగుణంగా ఐటి సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు త మ ఐటి వ్య వ స్థ ల ను బ లోపేతం చేయాల ని సిఇఒలను ఆయన కోరారు.

ఎన్నికల కమిషనర్ శ్రీ అనూప్ చంద్ర పాండే తన ప్రసంగంలో భారత రాష్ట్రపతి పదవికి రాబోయే ఎన్నికల కోసం రాబోయే ఎన్నికల కోసం రాష్ట్రాలలో లాజిస్టిక్స్ ఏర్పాటుతో సహా రాబోయే కొన్ని నెలల సిఇఒల ఎజెండాను హైలైట్ చేశారు. ఓటర్ల జాబితాలను నవీకరించడం, పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల మెరుగుదల, ఈవీఎంలు-వీవీప్యాట్ నిల్వ, నిర్వహణ, అధికారుల శిక్షణ, సామర్థ్యం పెంపుదలతో సహా ఎన్నికల వ్యవస్థ యొక్క ప్రాథమిక లక్షణాలను బలోపేతం చేయడానికి మరియు అప్గ్రేడ్ చేయడానికి సిఇఒలు ఈ లీన్ పీరియడ్ను ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఓటరుతో మరింత మెరుగ్గా అనుసంధానం కావడానికి వినూత్నమైన స్వీప్ వ్యూహాలను అమలు చేయాలని ఆయన సిఇఒలను కోరారు.

మహమ్మారి మధ్య క్లిష్టమైన మరియు సవాలు సమయాల్లో అసెంబ్లీ ఎన్నికలను నడిపించడంలో సిఇసి శ్రీ సుశీల్ చంద్ర నాయకత్వాన్ని శ్రీ పాండే అభినందిస్తూ, మహమ్మారి సమయంలో భారతదేశంలో ఎన్నికలను నిర్వహించడం అంతర్జాతీయంగా గుర్తించబడిందని అన్నారు.

సెక్రటరీ జనరల్ శ్రీ ఉమేష్ సిన్హా తన స్వాగతోపన్యాసంలో, మన గత అనుభవాలు మరియు కొత్త అభ్యాసాలను ప్రతిబింబించడానికి ఈ సదస్సు ఒక మాధ్యమం అని పేర్కొన్నారు. మహమ్మారి సమయంలో ఇటీవలి ఎన్నికలు మొత్తం ప్రపంచానికి ఎన్నికల నిర్వహణలో ఒక నమూనా మార్పును తీసుకు వచ్చాయని, కోవిడ్-19 ప్రోటోకాల్స్ వ్యవస్థలో అంతర్భాగంగా మారాయని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో కమిషన్ ఈసీఐ మ్యాగజైన్ 'మై ఓట్ మ్యాటర్స్' తాజా ఎడిషన్ ను విడుదల చేసింది. 2022 లో ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలు చేపట్టిన కార్యక్రమాలు మరియు ప్రయత్నాలపై మరియు క్షేత్రస్థాయి నుండి ఎన్నికల కథనాలపై ఈ త్రైమాసిక పత్రిక యొక్క ఈ ఎడిషన్ లో అనేక వ్యాసాలు ఉన్నాయి.

ఎన్నికల గణాంకాల పాకెట్ పుస్తకాన్ని కూడా కమిషన్ విడుదల చేసింది. ఈ బుక్‌లెట్‌లో సమర్పించబడిన డేటా 2017 నుండి 2021 వరకు దేశం చేసిన ఎన్నికల ప్రయాణంపై ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇది అన్ని సాధారణ ఎన్నికలు మరియు ఈ కాలంలో నిర్వహించిన రాజ్యసభ మరియు శాసన మండలి ఎన్నికల ముఖ్యాంశాలను కలిగి ఉంటుంది. ఎలక్షన్ స్టాటిస్టిక్స్ పాకెట్ బుక్ అనేది 2014 నుండి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా యొక్క సాధారణ ప్రచురణగా భారత ఎన్నికలపై డేటాను సరళీకృత రూపంలో అందిస్తుంది.

'మై ఓట్ మ్యాటర్స్' మరియు ఎలక్షన్ స్టాటిస్టిక్స్ పాకెట్ బుక్‌తో పాటు, 1957 నుండి 1977 వరకు జరిగిన సెకండ్ నుండి ఏడవ సాధారణ ఎన్నికలకు సంబంధించిన కథన నివేదికల పునర్ముద్రణను కూడా కమిషన్ విడుదల చేసింది. భారత ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, భాగస్వామ్యాత్మకంగా మరియు సమ్మిళితంగా మార్చడంలో కమిషన్ యొక్క అలుపెరగని కృషిని సంగ్రహించిన సమగ్ర పత్రం కథనం నివేదిక.

ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారు అవలంబించిన అనుభవాలు, అభ్యసనలు మరియు వినూత్న విధానాల గురించి ఐదు రాష్ట్రాల సిఇఒలు క్లుప్తంగా ప్రజంటేషన్ ఇచ్చారు.

ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాలు/యూటీల నుండి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు, సీనియర్ డిఇసిలు, డిఇసిలు, డిజిలు మరియు కమిషన్‌లోని ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. రెండవ రోజు బఖ్తవర్‌పూర్‌లో కొత్తగా ప్రారంభించబడిన ఇంటిగ్రేటెడ్ ఎలక్షన్ కాంప్లెక్స్ ను సందర్శించడంతో పాటు సిస్టమాటిక్ ఓటర్ల ఎడ్యుకేషన్ మరియు ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (ూఎఇఇఖ) వ్యూహంపై ప్రత్యేక చర్చ కూడా ఉండనుంది .

బియ్యం విషయంలో తెలంగాణ సర్కార్‌కు గుడ్ తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 12:ఎట్టకేలకు తెలంగాణ సర్కార్ ఓ తీపి కబురు అందించింది కేంద్రం. బాయిల్డ్ రైస్ తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత యాసంగి సీజన్ లో 92.34 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో నుంచి 62.52 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. సాధారణ బియ్యం ఇవ్వడానికి ముందుకు రాని మిల్లర్లు? 56.47 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం ఇచ్చారు. దీంతో ఫోర్టిఫైడ్ బాయిల్డ్ రైస్ ఇస్తామంటూ కేంద్రానికి కేసీఆర్ సర్కార్ అనేక సార్లు లేఖలు రాసింది. కానీ కేంద్రం మాత్రం అంగీకరించలేదు.

దీంతో ఈ విషయమై సీఎం కేసీఆర్, మంత్రులు కేంద్రంపై ఫైర్ అయ్యారు. బీజేపీ పార్టీ నేతలు సైతం అలాగే బదులు ఇచ్చారు. బాయిల్డ్ రైస్ తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా అంగీకరించడంతో తెలంగాణ ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. కేంద్రం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కిషన్ రెడ్డి.

ఈ నెల 14 న నల్లగొండ జిల్లాలో కేటీఆర్ పర్యటన ..

హైదరాబాద్, మే 12:టిఆర్ఎస్ పార్టీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా వరుస పర్యటనలు , ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన లు చేస్తూ బిజీ బిజీ గా గడుపుతున్నారు. ఇక ఐటీ మంత్రి కేటీఆర్ సైతం ప్రతి రోజు పలు జిల్లాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ వస్తున్నారు. ఈ నెల 14 న నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని హాలియా, నందికొండ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా హాలియా పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.మిర్యాలగూడ రహదారిలో హెలీపాడ్, పట్టణంలోని మినీ స్టేడియంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సభ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఆ తర్వాత నందికొండ పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర పాఠశాల ఆవరణ, పెద్దవూర మండలం సుంకిశాలలో హెలీపాడ్ కోసం స్థల పరిశీలన చేశారు.

శాతావాహన లయన్స్ క్లబ్ అధ్వర్యములో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

కరీంనగర్ , మే 12:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పట్టణంవావిలాలపల్లిలోని వసుంధర నర్సింగ్ హె?మ్ శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినిధులతో కలిసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భముగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రేమ , అప్యాయతకు చిహ్నంగా నర్సులు పిలుస్తారని మరియు అసుపత్రుల్లో ముఖ్యమైన కార్యకలాపాలతో పాటు ఇతర విభాగాల్లో ఉత్తమంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శముగా నిలుస్తున్నారని చెప్పారు . నేటి కాలంలో ఇంట్లో వారికి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే మనకంటే ఎక్కువగా ఆదరించి సేవచేసేది వారేనని కొనియాడారు . ప్రతి ఒక్కరు వారి నుండి అన్ని రకాలుగా సేవలు పొందేవారేనని గుర్తు చేస్తు ప్రత్యేకంగా కరోనా మహామ్మరి విజృంభన సమయంలో వారు చేసిన సేవలు వెలకట్టలేనిదని చెప్పారు . వారి సేవలను దృష్టిలో పెట్టుకొని నేడు వారికి సన్మానం చేయడం జరిగినదని కార్యక్రమ సమన్వయకర్త। లయన్ డా.। బి మధుసూధన్ రెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో లయన్ వి.జగదీశ్వర చారి , లయన్.ఇ. రమేష్గారు , లయన్ అరవిందాబాబు , వైద్యులు డా . వి . వనజారెడ్డి గ , ఆసుపత్రి సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు .

దూలూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన

-ప్రత్యేక పూజలు చేసిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మే 12:(నేటినిజం ప్రతినిధి): కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో గురువారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. దీనికి తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి హాజరై, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆకుల లక్ష్మీనారాయణ, ఆండాళు,మాజీ సర్పంచ్ గుండారపు గంగాధర్, మేడిపల్లి రాజారెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, లింగారెడ్డి, గడ్డం అరుణ్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మహేష్, నల్ల గంగాధర్, మిట్టపల్లి గంగారెడ్డి, మగ్గిడి రాజేందర్ తదితరులు ఉన్నారు.

తమిళ్‌ను హైకోర్టు అధికార భాషగా చేయండి- ప్రధాని, సీజేఐకు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై, మే 12: తమిళ్‌ను మద్రాస్ హైకోర్టు అధికార భాషగా చేయాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో రెండు డిమాండ్లను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీతోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు గురువారం లేఖ రాశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల హైకోర్టుల్లో ఇంగ్లీష్‌తోపాటు హిందీని కూడా అధికార భాషగా పరిగణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో ఇంగ్లీష్‌తోపాటు స్థానిక భాషను అధికార భాషగా చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నదని అన్నారు. సామాన్యులకు చట్టం అర్థమయ్యేలా చేయడం న్యాయ వ్యవస్థలో ఎంతో అవసరమన్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టులో న్యాయమూర్తుల నియామకాల గురించి సీఎం స్టాలిన్ తన లేఖలో ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా సమాజంలోని అన్ని వర్గాల నుంచి ఉన్నత న్యాయ వ్యవస్థలో ప్రాతినిధ్యం తగ్గడాన్ని మనం చూస్తున్నామని తెలిపారు. న్యాయ తీర్పునకు ప్రాథమికమైన 'వైవిధ్య లోటు'కు ఇది దారితీస్తుందని చెప్పారు.

అలాగే దేశ వ్యాప్తంగా సుప్రీంకోర్టు ప్రాంతీయ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్నదని గుర్తు చేశారు. ధనిక, పేద అన్న బేధం లేకుండా పౌరులందరికీ దేశ అత్యున్నత న్యాయస్థానానికి నేరుగా ప్రవేశం ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 చెబుతోందన్నారు. అయితే దక్షిణాది వంటి రాష్ట్రాలకు చాలా దూరంగా ఢిల్లీలో సుప్రీంకోర్టు ఉందన్నారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కును ఆయా రాష్ట్రాల ప్రజలు కోల్పోతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు.

సాలార్ జంగ్ మ్యూజియంలో మే 16 నుంచి 21 వరకు అంతర్జాతీయ మ్యూజియం వారోత్సవాలు

న్యూఢిల్లీ, మే 12:సాలార్ జంగ్ మ్యూజియంలో మే 16 నుంచి 21 వరకు అంతర్జాతీయ మ్యూజియం వారోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మ్యూజియంలో ' వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. . ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడిన సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్ రెడ్డి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మే 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. "మ్యూజియంల ప్రాధాన్యత" అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్నినిర్వహిస్తామని అన్నారు. తెలియజేసారు. మ్యూజియంలు కేవలం సాంస్కృతిక వారసత్వ ప్రదర్శనశాలలు మాత్రమే కాదని ఆయన స్పష్టం చేశారు. గత చరిత్ర, సంస్కృతి మరియు సంప్రదాయాలపై సందర్శకులకు విజ్ఞానం అందించే విద్యా కేంద్రాలుగా మ్యూజియంలు పనిచేస్తాయని ఆయన అన్నారు.

అంతర్జాతీయ మ్యూజియం వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలను డాక్టర్ నాగేందర్ రెడ్డి వివరించారు. అంతర్జాతీయ మ్యూజియం వారోత్సవాల సందర్భంగా సాలార్ జంగ్ మ్యూజియంలో కింది కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు శ్రీ రమణారెడ్డి, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ శ్రీమతి అనురాధారెడ్డి కూడా విలేకరులతో మాట్లాడారు. ఫోటో క్లబ్ అధ్యక్షుడు శ్రీ జనార్ధ రెడ్డి,క్యూరేటర్లు డాక్టర్ ఖుసుమ్, డా.నాయక్, సాలార్ జంగ్ మ్యూజియం సలహాదారుడు శ్రీ ఎం. వీరేంద్ర ఇతర అధికారులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

విమానంలో చెలరేగిన మంటలు..113 మంది ప్రయాణికులు సురక్షితం

బీజింగ్, మే 12:: చైనాలోని చాంగ్ కింగ్ ఎయిర్ పోర్టులో ఘోర విమాన ప్రమాదం తప్పింది. టిబెట్ ఎయిర్ లైన్స్ కు చెందిన విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. టేకాఫ్ కు విమానం సిద్ధమైన సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానంలో 113 మంది ప్రయాణికులు, 9 మంది విమాన సిబ్బంది ఉన్నారు. మంటలు చెలరేగిన వెంటనే అప్రమత్తమైన విమానాశ్రయ సిబ్బంది? ప్రయాణికులను, విమాన సిబ్బందిని అత్యవసర మార్గాల ద్వారా కిందకు దించారు. ఈ ప్రమాదంలో 25 మందికి గాయాలయ్యాయి.

కాగా, గురువారం ఉదయం 8 గంటల సమయంలో చాంగ్‌కింగ్ ఎర్‌పోర్టులో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సిబ్బంది విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించారు. దీంతో వెంటనే ల్యాండ్ చేశారు. అయితే ల్యాండింగ్ అవుతుండగా అది రన్‌వేదాటి వెళ్లిపోయింది. ఈ క్రమంలో విమానం రెక్కలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికే అప్రమత్తంగా ఉన్న ఎయిర్‌పోర్ట్ సిబ్బంది.. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బందిని అత్యవసర ద్వారం నుంచి కిందికి దించివేశారు. గాయపడినవారిని దవాఖానకు తరలించామని వెల్లడించారు. రన్‌వేపై ప్రమాదం జరగడంతో కొద్దిసేపటివరకు విమాన రాకపోకలను నిలిపివేశారు.

వడ్డీరేట్లు పెంచితే వృద్ధిరేటుకు దెబ్బ.. ఆర్థికశాఖ కార్యదర్శి సోమనాథన్!

న్యూఢిల